# నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

- స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 21, ఎస్జీటీలో 67మంది అభ్యర్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 28 : ఈ నెల మొదటివారంలో జరిగిన డీఎస్సీ2024 సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో 'ప్రత్యేక విద్య' విభాగంలో పలు కారణాలతో నిలిచిపోయిన పోస్టులకు ఈ నెల 29, 30వ తేదీల్లో నగరంలోని ఖమ్మం డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. దివ్యాంగుల విద్యా బోధనకు రాష్ట్రం ప్రకటించిన డీఎస్సీలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ విభాగాల్లో సరాసరి 900పోస్టులకు పైగా రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష నిర్వహించి ఫలితాలు మెరిట్ లిస్టు ఆధారంగా విడుదలై పలు జిల్లాల్లో కౌన్సిలింగ్, ఎంపిక ప్రక్రియ పూర్తి అయ్యింది. అయితే ఖమ్మంతోపాటు 13జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ విభాగాల్లో పలు కారణాలతో 1:3 లిస్టు, ఎంపిక జాబితా నిలిచింది. ఆయా జిల్లాల్లో సదరు పోస్టులకు ఆటంకాలు తొలిగిన నేపథ్యంలో ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులు సోమవారం 1:3 లిస్టులు విడుదల చేశారు. సూపరింటెండెంట్ చావా శ్రీను ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఆయా అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఖమ్మంజిల్లాలో 27ఎస్జీటీ పోస్టులకు 67 మందికి, 8 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 21మందికి సమాచారం అందింది.



అభ్యర్థుల జాబితాను పరిశీలిస్తున్న డీఈవో, సూపరింటెండెంట్

## ఉదయం 10 గంటల నుంచి..

జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో మంగళవారం, బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ధ్రువపత్రాల ప్రక్రియ జరుగుతుంది. గతంలో జరిగిన లోపాలు పునారావృతం కాకుండా నిపుణులైన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులతో బృందాలను నియమించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు అవసరమైన విధంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ పత్రాలతోపాటు, 2 సెట్ల అటెస్టెడ్ చేసిన జిరాక్స్ ప్రతులను వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు. పరిశీలనకు మూడు బృందాలను నియమించగా వీరిలో స్కూల్ అసిస్టెంట్ విభాగానికి ఒక బృందం, ఎస్‌జీటీ విభాగానికి రెండు బృందాలను కేటాయించారు.

## 1:15 నిష్పత్తిలో భర్తీ

పాఠశాలల్లో టీచర్లను నియమించే సమయంలో పది మంది విద్యార్థులకు ఒక టీచర్ 1:10 నిష్పత్తిలో పరిగణలోకి తీసుకుంటారు. ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల నియామకాల్లో 1:15 నిష్పత్తిని పరిగణలోకి తీసుకుని భర్తీ చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లోకల్ బాడీలో 7 పోస్టులు, ప్రభుత్వంలో 1 ఉన్నాయి. ఎస్‌జీటీ విభాగంలో లోకల్‌బాడీ 27 పోస్టులు, ప్రభుత్వంలో 2 పోస్టులు ఉన్నాయి. సర్టిఫికెట్ల పరిశీలనపై కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలను డీఈవో సోమశేఖరశర్మ చేశారు.























